క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో స్వామి శాశ్వత హుండీలో కానుకలను లెక్కించారు. మాఘమాసం సందర్భంగా భక్తులు స్వామికి సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.3,14,880 నగదు వచ్చినట్లు ఈఓ బాబు తెలిపారు. కార్య క్రమంలో దేవదాయశాఖ తనిఖీ అధికారి రామాంజనేయులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, సభ్యులు, తాతిరెడ్డి, రామలింగారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేడు 'కోటంక'లో గ్రామోత్సవం

గార్లదిన్నె: మండలంలోని కోటంక గ్రామంలో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ స్వామికి ఏకవార రుద్రాభిషేకం, సహ స్రనామార్చన నిర్వహిస్తామన్నారు. అలాగే స్వామి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండి విగ్రహాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ఉంచి, రాత్రి గ్రామోత్సవం ప్రారంభిస్తామన్నారు. భక్తులు భజన కీర్తనలు, మేళతాళాలతో స్వామి సన్నిధికి చేర్చుతారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



శ్రీకాంత్ చౌదరి

గుంతకల్లు రూరల్: ఎంపీడీఓగా శ్రీకాంత్ చౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణప్ప ఫిబ్రవరి 29న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో కదిరి మండలం నుంచి బదిలీపై వచ్చిన శ్రీకాంత్ చౌదరి బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లు మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఆయనను కలిసి అభినందించారు.

దాతృత్వం చాటుకున్న కేతిరెడ్డి హర్షవర్దన్‌రెడ్డి



రాజేష్ కుటుంబీకులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్దన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుని చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సాయం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్దన్‌రెడ్డి. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన మల్ల రాజేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు గత నెల 25న మెయిన్ బజార్‌లో రాజేష్ ఆటోలో నుంచి బియ్యం బస్తాలను దించుకుంటున్న క్రమంలో ఉన్నట్లుండి కుప్పకూలిపోయాడు. కుటుంబీకులు అతడిని బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే ఉండడంతో రాజేష్ కుటుంబం స్నేహితుల ద్వారా విరాళాలు సేకరించారు. విషయం తెలుసుకున్న కేతిరెడ్డి హర్షవర్దన్‌రెడ్డి శుక్రవారం రాజేష్ ఇంటికి వెళ్లి.. చికిత్స కోసం రూ.లక్ష నగదును రాజేష్ సోదరుడు శ్రీకాంత్‌కు అందించి వారికి ధైర్యం చెప్పారు. రాజేష్ కుటుంబీకులు హర్షవర్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు 'పల్స్ పోలియో'



గార్లదిన్నెలో పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

గార్లదిన్నె/పెద్దవడుగూరు: మండల వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్లు దిలీప్‌కుమార్, గౌతమి, మంజుల తెలిపారు.శుక్రవారం గార్లదిన్నెలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద పల్స్ పోలియో వ్యాక్సిన్ పోస్టర్లు వైద్య సిబ్బంది విడుదల చేశారు. వైద్యులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఐదేళ్లలోపు చిన్నారులకు వైద్య సిబ్బంది ఉచితంగా పోలియో వ్యాక్సిన్ వేస్తారన్నారు. సోమ, మంగళవారం వ్యాక్సిన్ వేయించుకోని పిల్లలకు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి వ్యాక్సిన్ వేస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, పీహెచ్‌ఎన్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలంటూ మండల కేంద్రం పెద్దవడుగూరులో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ రాముడు, పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండువలా పింఛన్ల పంపిణీ



గుంతకల్లు పట్టణం 28వ వార్డులో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ గౌరి. చిత్రంలో చైర్‌పర్సన్ భవాని



పుట్లూరు మండలం బాలాపురంలో దివ్యాంగుడు లక్ష్మీనాయుడుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చెరుకూరి నాగేశ్వరరావు



పామిడి 5వ వార్డులో వృద్ధుడు దస్తగిరికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాధ

తాడిపత్రి/ శింగనమల/గార్లదిన్నె/పుట్లూరు/పామిడి/గుత్తి/గుంతకల్లు రూరల్/గుంతకల్లు టౌన్: ఏ ఆసరా లేని వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ పింఛన్ కానుక'ను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నారు. కులమతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తెల్లవారుజామునే తలుపుతట్టి మరీ పింఛన్ పంపిణీ చేస్తున్నారు. గతంలో చంద్రబాబు హయాంలో పింఛన్‌దారులు అష్టకష్టాలు పడేవారు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. జీతంలాగా ఒకటో తేదీ పింఛన్ అందుతుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు. తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది.

పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారు



జగనన్న మాకు పెద్ద కొడుకులాగా ఉన్నారు. ఒకటో తేదీనే పింఛన్‌ను వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. గతంలో పింఛన్ సరిగా వచ్చేది కాదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత పింఛన్ సక్రమంగా అందుతోంది. వచ్చే ఎన్నికల్లో పింఛన్‌దారులంతా జగన్‌కు అండగా ఉంటాం

– పద్మావతమ్మ, కల్లుమడి, శింగనమల మండలం

ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ



వృద్ధాప్యం వల్ల పని చేయలేక ఇంటి వద్దే ఉంటున్నాను. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం చాలా ఇబ్బందిపడ్డాం. రచ్చబండ వద్ద వేచి ఉండాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ప్రతి నెలా ఒకటో తేది వలంటీర్ మా ఇంటి వద్దకే ఉదయం 6 గంటలకే వచ్చి పింఛన్ పంపిణీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– నారాయణ రెడ్డి, శిరివరం, గార్లదిన్నె

జీవితం సాఫీగా సాగుతోంది



నాకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. కూలీ పనులు చేసి జీవనం సాగిస్తున్నాం. నాకు వైఎస్సార్ సామాజిక పింఛన్ వస్తోంది. సీఎం జగన్ నాకు నెలకు రూ. 3 వేలు పింఛన్ ఇస్తున్నాడు. కొడుకులు, కోడళ్లను పైసా డబ్బు అడగకుండా పింఛన్ సొమ్ముతో కాలం వెళ్లదీస్తున్నాను. సీఎం వైఎస్ జగన్ చల్లగా ఉండాలి. ఆయన మరోసారి సీఎంగా గెలవాలి.

–శ్రీకరం లక్ష్మన్న, సీపీఐ కాలనీ, గుత్తి

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో 2024–25 విద్య సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సతీష్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం నుంచి ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కనీసం 30 మార్కులు సాధిస్తే ప్రవేశానికి అర్హులన్నారు.

తాడిపత్రి అర్బన్: మండలంలోని మోడల్ స్కూల్‌లో 2024–25 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ పి.లావణ్య శుక్రవారం తెలిపారు. మార్చి 31 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లను కేటాయిస్తామన్నారు.

పామిడి: స్థానిక మోడల్‌స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ శుక్రవారం తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

యల్లనూరు: మండలంలోని చిలమకూరు ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ వెంకటపతి శుక్రవారం తెలిపారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: పేదల పక్షపాతి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తాడిపత్రి పట్టణం, రూరల్ గ్రామాల్లో రూ.10.50 లక్షలు విలువచేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు పంపిణీ చేసారు. ఎమ్మెల్యే బాధితుల ఇళ్లకు వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. పట్టణంలోని నందలపాడు శైలజకు రూ 3.50 లక్షలు, జయనగర్ కాలనీ నాగరాజుకు రూ.60వేలు, పుట్లూరు రోడ్డు నగరూరు శివమ్మకు రూ.3.50 లక్షలు, తాడిపత్రి రూరల్ మండలంలోని ఆవులతిప్పాయిపల్లె సుజాతకు రూ.1.30 లక్షలు, బందర్లపల్లి లెహన్‌కు 1.60 లక్షలు విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డెలవప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ రూప, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఆలూరు రామేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి విగ్రహ ప్రతిష్ట





అలంకరణలో చౌడేశ్వరీ అమ్మవారు, హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: మండల కేంద్రంలోని మార్కెట్‌లో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం శుక్రవారం చౌడేశ్వరీ అమ్మవారి దేవాలయం, అమ్మవారి విగ్రహ పున: ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. భక్తుల విరాళాలు రూ.4 కోట్లతో సర్వాంగ సుందరంగా నిర్మించిన ఆలయం, చౌడేశ్వరీ అమ్మవారి విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమం తొగటవీర క్షత్రియులు ఆధ్వర్యంలో చేపట్టారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తదితరులు చౌడేశ్వరీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహ నిర్మాణాలు



లబ్ధిదారుకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి

శింగనమల: ప్రతి సచివాలయం పరిధిలో అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నామని డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శింగనమల సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 105 మందికి ఇల్లు పట్టాలు మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలు అందిస్తూ..మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కురుబ ఉమ, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

గుంతకల్లుటౌన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ, శ్రీశంకరానంద ఎయిడెడ్, నారాయణ, శ్రీసరస్వతీ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటిరోజు విద్యార్థులు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

తాడిపత్రి అర్బన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గ వ్యాప్తంగా తొలిరోజు సజావుగా జరిగాయి. నియోజకవర్గ వ్యాప్తంగా తాడిపత్రిలో 4, యాడికిలో 1, పెద్దపప్పూరులో ఒక పరీక్షా కేంద్రాలన్ని ఏర్పాటు చేశారు. తొలిరోజు ఈ ఆరు పరీక్ష కేంద్రాల్లో 1870 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 162 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు.

గుత్తి రూరల్: కర్నూలు రోడ్డులోని మోడల్ స్కూల్, ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎస్‌ఐ నబీరసూల్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొత్తం 354 మంది విద్యార్థులకు గాను 15 మంది గైర్హాజరయ్యారు. చీఫ్‌గా ఉపన్యాసకురాలు రాజ్యలక్ష్మి, డిపార్టమెంటల్ ఆఫీసర్‌గా మోడల్‌స్కూల్ ఉపన్యాసకురాలు శిరీష వ్యవహరించారు. పరీక్ష కేంద్రం వద్ద సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ బెస్తరాజు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు. శనివారం సీనియర్ ఇంటర్‌కు సంబంధించి 254 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

గార్లదిన్నె: పామిడి జూనియర్ కళాశాలలో నిర్వహించిన మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు స్థానిక మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు సంబంధించిన 87 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ చంద్రనాయక్ శుక్రవారం తెలిపారు. అలాగే శనివారం ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 66 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

జగనన్నను మరోసారి దీవించండి



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని



మహిళకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: నాయీ బ్రాహ్మణులకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మీ చల్లని దీవెనలందించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలోని మోదినాబాద్ నుంచి నాయీబ్రాహ్మణ కాలనీకి వెళ్లేందుకు రూ.24 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాలనీకి రోడ్డు లేక ప్రజలు చాలా అవస్థలు పడ్డారన్నారు. అడ్డంకులన్నీ అధిగమించి రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్ధంతరంగా ఆగిన నాయీబ్రాహ్మణ కల్యాణ మండప నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు రూ.10 లక్షలను విడుదల చేశామన్నారు. అంతేకాకుండా నాయీబ్రాహ్మణుల కోసం మరో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 18 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. నాయీ బ్రాహ్మణులను రాష్ట్రంలో అన్ని ఆలయ కమిటీల్లో సభ్యులుగా నియమించడమే కాకుండా జగనన్న చేదోడు ద్వారా ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేసి తమ కులానికి మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామని కులసంఘం నాయకులు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని, మాజీ చైర్మన్ రామలింగప్పను నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, వార్డు ఇన్‌చార్జ్ పరుశురాముడు, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, నాయకులు ఆనంద్, ప్రసాద్, ఆంజనేయులు, వీరాంజి, ప్రమేష్‌బాబు, మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

గుంతకల్లు పట్టణంలోని 22వ వార్డుకు చెందిన సుల్తానా అనే మహిళకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసంలో బాధిత మహిళకు ఈ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్దన్ రెడ్డి

యాడికి: వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్దన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయలచెరువు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం, దర్గావీధి, నిమ్మకాయల మండీ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్న సీఎం అయితేనే సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. అనంతరం ఆయన మండలంలోని పిన్నేపల్లె గ్రామానికి చెందిన శేఖర్ కుమార్తె గీతికకు మంజూరైన రూ.65వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును రాయలచెరువులో శేఖర్‌కు అందజేశారు. అలాగే నగరూరు గ్రామానికి చెందిన చాకల క్రిష్టప్పకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్ష మంజూరు కావటంతో అతడి భార్య నారాయణమ్మకు అందజేశారు. కార్య క్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, డీసీఎంఎస్ సభ్యుడు వేలూరు జగదీస్ చౌదరి, వైస్ ఎంపీపీ చెన్నప్ప, సచివాలయాల కన్వీనర్ శివప్రసాద్, నాయకులు నాగేష్, రషీద్ శివయ్య, రవికాంత్, రంగనాయకులు రెడ్డి, జిలాన్, ఉపేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పెద్ద కదిరప్ప రథోత్సవం





రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, పూజల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి

గుంతకల్లు రూరల్: మండలంలోని వెంకటాంపల్లి గ్రామ కనుమల్లో వెలసిన పెద్ద కదిరప్ప స్వామి రథోత్సవాన్ని శుక్రవారం గ్రామస్తులు, వేలాదిమంది భక్తుల నడుమ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దర్శనార్థం భారీగా తరలి వచ్చిన భక్తజనంతో వెంకటాంపల్లి కొండ ప్రాంతం కిటకిటలాడింది. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం వేకువజామున లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో పెరవలి పారా విశ్వనాథ్ ఆధ్వర్యంలో సుమారు 42 జంటలకు ఉచితంగా సామూహిక వివాహాలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అందంగా అలంకరించబడిన రథోత్సవంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి వార్ల ఉత్సవ మూర్తులను కొలువదీర్చి రథాంగహోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. అనంతరం వేలాదిమంది భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారి రథోత్సవం ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు ఆమెకు స్వామి తీర్థ ప్రసాదాలతో పాటు పట్టువస్త్రాలను అందజేసి సత్కరించారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

గార్లదిన్నె: మండల కేంద్రంలోని జంబులదిన్నె సొసైటీలో పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, సీఈఓ సదాశివ సూచించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సొసైటీలో రుణాలు పొందిన రైతులు మార్చిలోపు వడ్డీ చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు వస్తాయన్నారు. సొసైటీ డైరెక్టర్లు వెంకటశివారెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని, రాజకీయ నాయకులు, కార్యకర్తలు గొడవలు సృష్టించే అవకాశం ఉండటంతో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

సంక్షిప్తం

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

తాడిపత్రి అర్బన్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బకాయి ఆస్తి పన్నులు, నీటి పన్నుల చార్జీలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒకేసారి ఏక మొత్తం చెల్లించే వారికి ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ నెల 31లోపు చెల్లించేవారికి ఈ విధానం వర్తిస్తుందన్నారు. ఈ నెలాఖరు వరకు అన్ని సెలవు దినాల్లో కూడా పన్నుల చెల్లింపు కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

'విద్యార్థులు సేవాగుణం కలిగి ఉండాలి'

గార్లదిన్నె: విద్యార్థులు చదువుతోపాటు సేవా గుణం కలిగి ఉండాలని జిల్లా చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ క్రిష్ణమాచారి సూచించారు.శుక్రవారం మండలంలోని పాపినేపాళ్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వీర ప్రకాష్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ పుల్లయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ఎస్‌ఆర్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యోగానందారెడ్డి అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గిరిబాబు శుక్రవారం తెలిపారు. అతడి వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగరాజు, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.